# మంచుదుప్పటి

## పి.ఎస్.నారాయణ కథలు

(రెండవ సంపుటం)

ఎమెస్కో

## ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | అజ్ఞాత శత్రువు | 11 |
| 2. | మీలాంటి ఒకరు | 22 |
| 3. | మానవత్వమా హాట్సాఫ్ | 37 |
| 4. | కసి | 50 |
| 5. | మంచుదుప్పటి | 61 |
| 6. | విరగని వీనస్ | 89 |
| 7. | పూర్ణబిందువు | 97 |
| 8. | ప్రయాణంలో ప్రణయం | 108 |
| 9. | ఋణం | 120 |
| 10. | ఎదురుగాలి | 131 |
| 11. | ప్రార్థన | 140 |
| 12. | గుండెదిటవు | 143 |
| 13. | వీక్‌పాయింట్ | 160 |
| 14. | అందం | 172 |
| 15. | తృప్తి | 184 |

# అజ్ఞాత శత్రువు

**మం**త్రాలయం వెళ్దాం అనుకున్నప్పుడు దారిలో మహబూబ్‌నగర్‌లో కాసేపు ఆగి మా వదినను చూసి వెళ్దాం అని నేను అంటే, మా శ్రీమతి మూతి బిగించి అటు తిరిగి పడుకున్నది.

అప్పుడు రాత్రి పదిగంటలయింది.

"ఒకసారి వెళితే ఏమౌతుంది?"

"ఆవిడగారి కూతురు తిట్టిన తిట్లను అప్పుడే మర్చిపోయారా? నేను మాత్రం చచ్చేటంతవరకూ మరిచిపోలేను" అన్నది ఒక్కసారి మెడతిప్పి.

మా అన్నయ్య కూతురు నన్ను తిట్టిన మాట వాస్తవమే. ఎందుకు తిట్టిందో గూడా నాకు తెలుసు. దానికి తెలుసు. నా ఉద్దేశ్యంలో అది మంచిది కాబట్టి నన్ను తిట్లతోనే వదిలేసింది.

నేను అదే అన్నాను. "అది తిట్టటంలో తప్పు ఉన్నదంటావా?"

"అయితే, తప్పంతా మనదేనంటారు. కాదంటే నాదంటారు. అవునా?" గుర్రుగా నా వంక చూస్తూ అన్నది.

"అవును!" పైకే అన్నాను. "ఈనాడు ఈ స్థితిలో నేను ఉండటానికి కారణం మా అన్నయ్య. ఎక్కడో పల్లెటూర్లో, మట్టి కొంపలో పడి ఉండవలసిన నేను కాలు కింద పెట్టనవసరం లేకుండా కార్లలోనూ, విమానాల్లోనూ తిరగ గలుగుతున్నానూ అంటే అందుకు కారణం మా అన్నయ్య. అలాంటి ఆయన..."

"మేం కాదు. అవునులేండి... తింటున్న తిండి మాది. ఖర్చు పెడుతున్న డబ్బు మాది. అన్నీ మావి అయినప్పుడు తిట్లు మాత్రం మావిగాకుండా ఎలా పోతయి?"

"శారదా!"

"అవునండీ, అనండి... మిమ్మల్ని ఇంత వృద్ధిలోకి తెచ్చిన మా నాన్న పోయాడు. కాలు కింద పెట్టకుండా అన్నీ చేసిన మా అమ్మ పోయింది. వాళ్ళు లేరు గదా, మర్చిపోవటం బహుతేలిక."

ఛ!... అన్నీ అయి పెంచిన అన్నయ్య పోతే శవాన్ని చూడటానికి గూడా వెళ్ళలేని నన్ను సుభద్ర తిట్టిందీ అంటే, తిట్టదూ మరి. కానీ, నా భార్యకు దాని తిట్లు మాత్రమే కనబడటం నా దౌర్భాగ్యం.

"నీతో మాట్లాడటమే నా బుద్ధితక్కువ!"

"అనండి, అనండి... ఎన్నయినా అంటారు. ఎవరూ లేనిదాన్ని గదా, ఏమయినా అనగలరు."

"ఎవరూ లేకపోవడమేమిటి? నలుగురు అన్నయ్యలున్నారు. ఇద్దరు అక్కయ్యలున్నారు. గది తలుపులన్నీ బిగించి నిన్ను ఓ చిన్నమాటన్నా ఆ ఆరుగురికీ అయిదు క్షణాలల్లో తెలిసిపోతుంది. ఆపైన నా చెవులు పిండి, నా ముక్కుకు తాడేసి, నీ చెంగుకు కట్టేయడానికి ఓ అరక్షణంగూడా పట్టదు!" నేను నవ్వాను. అది ఏడవలేక నవ్విన నవ్వని నాకు తెలుసు.

సరిగ్గా పదిహేను సంవత్సరాల క్రితం మొట్టమొదటిసారిగా ఇలాగే నవ్వాను, శారద నా భార్య అయిన రోజున. ఆమె నా భార్య అవ్వటానికి కారణం మా అన్నయ్య, ఆపైన మా వదిన.

"ఈ మట్టి గోడల మధ్య ఎన్నాళ్ళు బతుకుతావురా? ఇది మంచి అవకాశం. వాళ్ళకు డబ్బు ఉన్నది, హోదా వున్నది. ఆ అమ్మాయికి అందమున్నది. చదువున్నది. వాళ్ళకు ఏం లేదంటావ్? అన్నీ ఉన్నాయి. నిన్ను కోరి అల్లుణ్ణి చేసుకోవాలనుకుంటున్నారు. ఈ ప్రపంచంలో భార్య భర్త దగ్గరున్నా, భర్త భార్య దగ్గరున్నా రెండూ ఒకటే. ఇద్దరూ ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకొని సుఖంగా బ్రతకటమే ఎవరికైనా కావాల్సింది."

"ఇల్లరికం వెళ్ళి మీకు దూరమవ్వటం నాకిష్టంలేదు వదినా!" ఆ రాత్రి చాలాసేపు వాదించాను వదినతో అన్నయ్య లేకుండా చూసి. అన్నయ్యతో ముఖాముఖీ వాదించే ధైర్యం నాకు లేదు.

"ఇల్లరికం వెళ్ళినంత మాత్రాన మాఅందరికీ దూరమవ్వాల్సిన అవసరమేమున్నది? వస్తూ, పోతూ వుండవచ్చు. నువ్వు రావా, మేము రామా?"

"నువ్వెన్నయినా చెప్పు వదినా. నాకయితే చాలా భయంగా వుంది. డబ్బు పాపిష్టిది. రక్తమాంసాలు రుచి చూడ నంతవరకూ పులి సాధు జంతువే."